
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

# EVENING EDITION

నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com


4PM
www.suryaa.com
సోమవారం
17-03-2025
పేజీలు: 02

'బట్టతల' అంటూ భార్య వేధింపులు..

## భర్త ఆత్మహత్య

బట్టతల అంటూ భార్య అవహేళన చేయడంతో అవమానాన్ని తట్టుకోలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషాద ఘటన కర్ణాటకలో చామరాజనగర తాలూకాలోని ఉడిగాలలో ఆదివారం జరిగింది. వివరాల ప్రకారం.. పరమశివమూర్తి (32)కి మమతతో రెండేళ్ల కిందట పెళ్ళి జరిగింది. లారీ డ్రైవర్ అయిన పరమశివమూర్తికి పెళ్లినాటికే కొంత బట్టతల ఉంది. పెళ్లి తరువాత ఉన్న జుట్టు కూడా రాలిపోయింది. భార్య మమత 'నీకు జుట్టు లేదు, నీతో బయటకి రావాలంటే సిగ్గుగా ఉంది' వంటి మాటలనేది. దీంతో ఇద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. ఇదే క్రమంలో భర్తపై గృహహింస, కట్నం వేధింపుల కేసు కూడా పెట్టడంతో కొన్ని రోజులు జైలులో ఉండి ఇటీవలే పరమశివమూర్తి విడుదలయ్యాడు. జైలు నుంచి బయటికి వచ్చిన పరమ శివమూర్తి.. భార్య సోషల్ మీడియాలోని 'సింగిల్' స్టేటస్ చూసి మరింత ఆవేదన చెందాడు. ఈ వరుస పరిణామాల నేపథ్యంలో నోట్ రాసి పెట్టి.. ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనపై చామరాజనగర గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.




## రాజీవ్ యువ వికాసం ద్వారా యువతకు రూ.3 లక్షలు

తెలంగాణలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు.. రేవంత్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాజీవ్ యువ వికాసం పథకం కింద మార్చి 17 నుంచి దరఖాస్తులను స్వీకరించనుంది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్ దరఖాస్తుల ప్రక్రియను ఇవాళ ప్రారంభించనున్నారు.

**ఏప్రిల్ 5 వరకు..**

ఈ పథకానికి సంబంధించి.. ఏప్రిల్ 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించనున్నారు. రాజీవ్ యువ వికాసం పథకంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమీక్ష నిర్వహించారు. పథకం విధివిధానాలపై అధికారులకు పలు సూచనలు ఇచ్చారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత యువతకు భారీగా స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు రాజీవ్ యువ వికాసం పథకాన్ని తీసుకొచ్చామని స్పష్టం చేశారు భట్టి.

**రూ.6 వేల కోట్ల నిధులు..**


రాష్ట్రంలోని దాదాపు 5 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించేందుకు రూ.6 వేల కోట్లకు పైగా నిధులు ఖర్చుచేయాలని.. రేవంత్ ప్రభుత్వం భావిస్తోంది. చాలా రోజుల తర్వాత స్వయం ఉపాధి కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనుండటంతో.. భారీ సంఖ్యలో అప్లికేషన్లు వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.

**ప్రభుత్వం నిర్ణయం..**

యువతకు స్వయం ఉపాధి కల్పించేందుకు ఎస్సీ ఆర్థిక సహకార సంస్థ దాదాపు రూ.1200 కోట్లు, గిరిజన ఆర్థిక సహకార సంస్థ రూ.360 కోట్లతో కార్యాచరణ ప్రణాళికను రూపొందించాయి. ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖల పరిధిలో కూడా ప్రత్యేక అభివృద్ధి నిధులు భారీగా ఉన్నాయి. దీంతో ఎక్కువ సంఖ్యలో లబ్ధిదారులకు స్వయం ఉపాధి కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

**బీసీలకే ఎక్కువ..**

ఇటు బీసీల్లో ఎక్కువ మందికి లబ్ధి చేకూర్చేలా బీసీ కార్పొరేషన్ కార్యాచరణ ప్రణాళికను రూపొందించింది. తొలి ఏడాది 1.5 లక్షల మందికి స్వయం ఉపాధి కల్పించాలని రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే బడ్జెట్‌లో కేటాయించిన రూ.2 వేల కోట్లు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులను ఆమోదించే అవకాశాలు ఉన్నాయి.





బెట్టింగ్ యాప్స్ ప్రమోట్ చేసే వారి

# బెండు తీస్తున్న సజ్జనార్

దేశ భవిష్యత్తు యువతపైనే ఆధారపడి ఉందని వివేకానంద చెప్తుండేవారు. ఒక భారతదేశంలో ఉన్న యువత ప్రపంచంలో మరేఇతర దేశంలోను లేదు. అలంటి యువతిని కొందరు తమ స్వార్థం కోసం తప్పదోవ పట్టించి వారిని వ్యసనాలకు బానిసలుగా చేయాలనీ చూస్తున్నారు. మరి ముఖ్యంగా కొందరు సెలబ్రిటీస్ పేరుతో ఆన్ లైన్ బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేసేందుకు ఆ కంపెనీల నుండి లక్షల లక్షల సొమ్ము తీసుకుని యువతని బెట్టింగ్ యాప్స్ కు బానిసలుగా చేస్తున్నారు. దీనిని ఎలాగైనా సరే అడ్డుకట్ట వేయాలని యువతను ఈ బెట్టింగ్స్ భారీ నుండి తప్పించాలని పూనుకున్నారు హైదరాబాద్ మాజీ అడిషల్ డీజీపీ, ప్రస్తుత ఆర్టీసీ ఎండి వీసీ సజ్జనార్.. లోకల్ బాయ్స్ నుండి సినిమా సెలెబ్రిటీస్ వరకు ఎవరెవరు ఈ బెట్టింగ్ యాప్స్ ను ప్రమోట్ చేస్తున్నారో వారి భరతం పడుతున్నారు సజ్జనార్. మీ స్వార్ధ ప్రయోజనాల కోసం యువత భవిష్యత్తును నాశనం చేయాలని చుస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. దింతో బెట్టింగ్ యాప్ ప్రమోషన్స్ చేసిన వాళ్ళు ఒక్కొక్కలుగా వచ్చి సారీ చెప్తున్నారు. పోలీస్ కేసులకు భయపడి చెప్తున్నారా లేక వాళ్లలో మానవత్వం పరిమళించిందా అనేది పక్కన పెడితే ఒక్కొక్కరు వారు ప్రమోట్ చేసిన విడియోలను సైతం తమ అకౌంట్స్ నుండి డిలీట్ చేస్తున్నారు. ఇప్పటికే లోకల్ బాయ్ నాని అరెస్ట్ కాగా భయ్యా సన్నీ యాదవ్, యూట్యూబ్ హర్ష మీద కేసులు నమోదు కావడంతో వారు పరారీలో ఉన్నారు. సినీనటి సురేఖ కూతురు ఇంకెప్పడు బెట్టింగ్ యాప్స్ ను ప్రోమోట్ చేయను అని క్షమాపణలు చెప్తూ వీడియో రిలీజ్ చేసింది. బుల్లితెర నటి రీతు చౌదరి ఇంకా కొంతమంది పోలీస్ కేసులు అవుతుండటంతో వీడియోస్ డిలీట్ చేస్తున్నారు. నా అన్వేషణ అనే యూట్యూబర్ తో కలిసి అవగాహణ పెపొందేలా వీడియోలు చేస్తున్నారు సజ్జనార్. ఇప్పటికైనాబెట్టింగ్ యాప్స్ ప్రోమోట్ చేసే సైబర్ టెర్రరిస్టుల అకౌంట్స్ ను అన్ ఫాలో కొట్టండి. వారి అకౌంట్ లను రిపోర్ట్ చేయండి. ఎవరైనా బెట్టింగ్ యాప్ ల వల్ల నష్టపోతే సమీపంలోని పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేయండని సజ్జనార్ ప్రజలకు విజ్ఞప్తి చేస్తున్నారు. ఏదేమైనా సజ్జనార్ పూనుకున్న ఈ నిర్ణయం పట్ల సోషల్ మీడియాలో మంచి స్పందన లభించింది. ప్రజా ప్రయోజనాల కోసం యువత భవిత కోసం సజ్జనార్ తీసుకున్న నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేసున్నారు.

## ఐపీఎల్‌కు ముందు జియో యూజర్లకు గుడ్‌న్యూస్

క్రికెట్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఇండియన్ ప్రీమియం లీగ్ 2025 మరికొన్ని రోజుల్లో ప్రారంభం కానుంది. ఈ ఐపీఎల్ మ్యాచ్‌లను డిజిటల్ వేదికగా జియో ప్రసారం చేస్తున్న సంగతి తెలిసిందే. అయితే, ఇప్పటివరకు ఉచితంగా వీక్షించిన అభిమానులకు.. జియోహాట్‌స్టార్ విలీనం రూపంలో షాక్ తగిలింది. మ్యాచ్‌ల కోసం కనీస సబ్‌స్క్రిప్షన్ తీసుకోవాల్సిన అవసరం ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే లీగ్ టోర్నీ ప్రారంభానికి ముందు జియో యూజర్లకు కంపెనీ గుడ్ న్యూస్ చెప్పింది. ఎంపిక చేసిన ప్లాన్లపై జియో యూజర్లు 90 రోజుల పాటు ఉచితంగా జియోహాట్‌స్టార్ సబ్‌స్క్రిప్షన్‌ను పొందొచ్చని ప్రకటించింది. రూ.299, అంతకంటే ఎక్కువ ధర కలిగిన ప్లాన్‌లపై ఈ ఆఫర్ అందిస్తున్నారు. పాత, కొత్త యూజర్లు ఈ ప్లాన్లతో రీఛార్జ్ చేసుకుంటే.. 90 రోజుల పాటు జియోహాట్‌స్టార్ ప్రసారాలను ఉచితంగా వీక్షించొచ్చు. మొబైల్, టీవీల్లో 4కే స్ట్రీమింగ్ సేవలు పొందొచ్చు. దీంతో పాటు 50 రోజుల జియో ఫైబర్ సేవలను కూడా ఉచితంగా అందుకోవచ్చని రిలయన్స్ జియో వెల్లడించింది.




## ఒంటరిగా కూర్చుని ఏడవలేను!



4బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భారత జట్టు వైఫల్య ప్రదర్శన అనంతరం భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) తీసుకొచ్చిన నిబంధలలో భాగంగా.. ఆటగాళ్ల కుటుంబాలను విదేశీ టోర్నీలకు తీసుకెళ్లే విషయంలో బోర్డు విధించిన ఆంక్షలపై స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఆటగాళ్లకు కష్టసమయాల్లో కుటుంబ మద్దతు ఎంతో అవసరమని, తానైతే హోటల్ రూమ్‌లో ఒంటరిగా కూర్చుని ఏడవలేనని కోహ్లీ వ్యాఖ్యానించాడు. శనివారం బెంగళూరులో జరిగిన ఆర్‌సీబీ ఇన్నోవేషన్ ల్యాబ్ సమ్మిట్‌లో కోహ్లీ మాట్లాడుతూ.. 'కుటుంబం పాత్ర గురించి, వాళ్లు ఇచ్చే మద్దతు గురించి కొంతమందికి ఎంతచెప్పినా అర్థం కాదు. మ్యాచ్‌లో ఎంతో తీవ్రతతో ఆడుతుంటాం. ఆట పూర్తికాగానే కుటుంబం చెంతకు చేరితే మనసుకు ఎంతో ప్రశాంతంగా ఉంటుంది. అది ఆటగాళ్లకు చాలా అవసరం. అంతేగానీ మ్యాచ్ ముగిశాక హోటల్ రూమ్‌లోకి ఒక్కడే వెళ్లి విచారిస్తూ కూర్చోవాలా ? నేనైతే అలా చేయలేను. ఆట ముగిసినా నేను సాధారణంగానే ఉండాలని కోరుకుంటా. కుటుంబంతో గడిపే ఏ ఒక్క క్షణాన్ని నేను వదులుకోను' అని కుండబద్దలు కొట్టాడు. 45 రోజుల విదేశీ పర్యటనలైతే రెండు వారాలు మాత్రమే కుటుంబాలకు అనుమతినిచ్చిన బీసీసీఐ.. చిన్న టూర్లకు తీసుకెళ్లకపోవడమే మంచిదన్నట్టు సూచించింది.



ప్రేమించి పెళ్లి చేసుకున్న

## 45 రోజులకే..

మండలంలోని రాళ్లగడ్డ తండాలో ఓ నవవధువు ఆత్మహత్య చేసుకుంది. ప్రేమించి పెళ్లి చేసుకున్న నెలన్నర రోజులకే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడటం కలకలం రేపింది. స్థానికుల వివరాల మేరకు.. గొల్లపల్లి శివారులోని రాళ్లగడ్డ తండాకు చెందిన పవన్‌కుమార్, ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన చర్చిత (23) ఖమ్మంలో బీఫార్మసీ చదువుతున్న సమయంలో ప్రేమలో పడ్డారు. 45 రోజుల క్రితం ఆమె తన తల్లిదండ్రులను ఎదిరించి ప్రేమ వివాహం చేసుకుంది. భార్యాభర్తలు ప్రస్తుతం రాళ్లగడ్డ తండాలో ఉంటున్నారు. ఆదివారం భర్త పవన్‌కుమార్ డ్యూటీకి వెళ్లి వచ్చి, తండాలోని స్నేహితులతో మాట్లాడుతున్న సమయంలో చర్చిత ఇంట్లో ఒంటరిగా ఉంది. కొద్ది సేపటికే ఇంట్లోకి వెళ్లి చున్నీతో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా.. మార్గమధ్యంలో మృతిచెందింది. మృతురాలు ఎంఫార్మసీ పరీక్షలకు హాజరవుతుందని.. భర్త, ఇతర కుటుంబ సభ్యులతో అన్యోన్యంగా ఉంటున్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడటానికి కారణాలు ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇందుకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.




## మూడో రోజు అసెంబ్లీ సమావేశాలు..

**సభ ముందుకు ఐదు బిల్లులు**

అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు మూడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం 10 గంటలకు శాసనసభ, శాసన మండలి ప్రారంభంకానున్నాయి. ప్రశ్నోత్తరాల అనంతరం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లు, ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత బిల్లు సహా ఐదు బిల్లులను శాసన సభలో ప్రభుత్వం ప్రవేశపెట్టనుంది. ఇక మండలిలో మాత్రం ప్రశ్నోత్తరాలకే పరిమితం కానున్నది. శాసనసభలో మెస్ డైట్ చార్జీల పెంపు, జాతీయ రహదారుల సమీపంలో ట్రామా కేర్ కేంద్రాలు, విదేశీ ఉపకార వేతనాల చెల్లింపులో జాప్యం, కామారెడ్డి జిల్లాలో పర్యాటక కేంద్రాల అభివృద్ధి, దేవాలయ పర్యాటకం, పర్యావరణ పర్యాటకాల ప్రోత్సాహం, శంకరపట్నం మండలంలో హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం, ప్రభుత్వ వెబ్‌సైట్లలో జీవోలు, సర్క్యులర్లు, హెచ్‌ఎండీఏ భూముల తాకట్టు, మహబూబాబాద్ పట్టణం చుట్టూ రింగ్ కోసం నిధులు, టీ-ప్రైడ్ కింద రాయితీకి సంబంధించిన ప్రశ్నలు శాసనసభలో చర్చకు రానున్నాయి.

ప్రభాస్ 'ఫౌజీ'లో

## మరో హీరోయిన్?

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా డైరెక్టర్ హను రాఘవపూడి దర్శకత్వంలో రాబోతున్న సినిమా ఫౌజీ. ఈ సినిమాను పీరియాడిక్ వార్ అండ్ లవ్ స్టోరీగా దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్నాడు. అయితే, ఈ చిత్రంలో బాలీవుడ్ హీరోయిన్ ఆలియా భట్ ఓ కీలక పాత్రలో నటిస్తోందని, పైగా ఆమె యువరాణి పాత్రలో కనిపిస్తారని వార్తలు వచ్చాయి. ఇప్పుడు ఈ చిత్రంలో మరో సీనియర్ హీరోయిన్ కూడా నటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. కథ ప్రకారం సెకండ్ హాఫ్ లో వచ్చే ఈ పాత్ర సినిమాలో కీలక పాత్ర అని.. ఇప్పుడు ఈ పాత్ర కోసం బాలీవుడ్ హీరోయిన్ కరీనా కపూర్ ను తీసుకోబోతున్నట్లు తెలుస్తోంది. కాగా, ఈ సినిమాలో ప్రభాస్ ఓ సైనికుడి పాత్రలో నటిస్తున్నాడని తెలుస్తోంది. ఇక ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు అనుపమ్ ఖేర్ కూడా ఓ కీలక పాత్రలో నటిస్తున్నాడు. రీసెంట్ గా ఆయన ఫౌజీ సెట్స్‌లో జాయిన్ అయ్యారు. అలాగే, ఈ సినిమాలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తుండగా మైత్రీ మూవీ మేకర్స్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4 PM



## వీధికుక్కల కోసం..
## సొంతిల్లు అమ్మిన యువకుడు

సొంతింటి కల నెరవేర్చుకోవడానికి చాలామంది కష్టపడుతుంటారు. అలాంటిది ఉన్న ఇంటిని తిరునెల్వేలి జిల్లాకు చెందిన ఓ యువకుడు వీధి కుక్కల కోసం అమ్మేశారు. వీరవనల్లూర్‌కి చెందిన విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగి మురుగన్, మూక్కమ్మాళ్ కుమారుడు గోమతి శంకర్(31). ఒకే కుమారుడు కావడంతో ఎంతో ప్రేమగా చూసుకునేవాడు. డిప్లొమో చదివిన గోమతి శంకర్ రెండేళ్లు విదేశాల్లో పనిచేశాడు. అది నచ్చకపోవడం, భారీ వాహనాల డ్రైవింగ్‌పై ఏర్పడిన ఇష్టంతో సొంతూరికి వచ్చి లారీ డ్రైవరుగా పని చేయడం ప్రారంభించారు. సమాచారం వస్తే.. గోమతి శంకర్ మాట్లాడుతూ.. వీధి శునకాలు గాయపడినట్లు సమాచారం వస్తే వెంటనే వెళ్లి కాపాడేవాడిని. చికిత్స అందించిన తర్వాత ఇంటికి తీసుకొచ్చి, పూర్తిగా కోలుకున్న తర్వాత పూర్వస్థానంలోనే వదిలేసేవాడిని. అంగవైకల్యం ఉన్నవి ఇంట్లో నాతోపాటే ఉంటాయి. ఒకదశలో ఇల్లంతా శునకాలతో నిండిపోవడంతో స్థానికులు తీవ్ర వ్యతిరేకత తెలిపారు. ఏం చేయాలో అర్థం కాలేదు. తండ్రితో మాట్లాడాను. మానవత్వం మరిచిపోయిన ఈ రోజుల్లో శునకాలపై నేను పెంచుకున్న ప్రేమను చూసి, ఇల్లు విక్రయించి, ఊరు బయట స్థలం తీసుకొని, వాటిని అక్కడే ఉంచుదామని చెప్పారు. ఇది నాకు సంతోషాన్ని కలిగించింది. వెంటనే ఇంటిని విక్రయించి స్థలం కొని అక్కడ స్వచ్ఛంద సంస్థల సాయంతో షెడ్ ఏర్పాటు చేశాను. కరు యానిమల్స్ రెస్క్యూ యూనిట్ ట్రస్ట్ అని పేరు పెట్టి శునకాలు మాత్రమే కాకుండా పిల్లులకు కూడా ఆశ్రయం కల్పిస్తున్నాను. ప్రస్తుతం అక్కడ 72 శునకాలు, 16 పిల్లులు ఉన్నాయి. రోజుకి 28 కిలోల బియ్యం, 10 కిలోల చికెన్, 2 కిలోల చేపలు, 4 లీటర్ల పాలుతో పాటు కోడి గుడ్లు పెడుతున్నా. రోజుకి రూ.3 వేలు ఖర్చవుతుంది. ఇప్పటి వరకు 500 నుంచి 600 శునకాలను రక్షించాను. తండ్రి ఎంతగానో అండగా నిలబడ్డారని తెలిపారు.

## సినిమాల్లోకి ఎంట్రీ.. జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు



గత మూడు నెలల క్రితం డైరెక్టర్ రామానుజం తనకు చూపిన ఫోటో చూసి కనెక్ట్ అయ్యానని కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి అన్నారు. 2013 నుంచి తనలాంటి వ్యక్తి కోసం చూస్తున్నానని.. టైం ఇస్తారా అని డైరెక్టర్ అడగగానే... టైం ఇవ్వలేనేమోననుకున్నా.. కానీ ఆ తర్వాత డైరెక్టర్ చూపెట్టిన ఫోటో చూసి ఇది కచ్చితంగా చేయాలని డిసైడ్ అయ్యా'' అని జగ్గారెడ్డి చెప్పారు. ''ఏ వార్ ఆఫ్ లవ్' క్యాప్షన్‌ను డైరెక్టర్ ముందే రాసుకున్నారు. నా కథకు, లవ్‌కు సంబంధం లేదు. కథ చెప్పే క్రమంలో స్టార్టింగ్ అంతా డైరెక్టర్ చెప్పారు.. మిగతా అంతా నా లైఫ్‌లో జరిగిన కొన్ని విషయాలు చెప్పా. కొన్ని విషయాలలో డైరెక్టర్ కన్విన్స్ అయ్యారు. నేను సినిమాల్లోకి వెళ్లడానికి ఢిల్లీ టూర్ పనికొచ్చింది. నా రాజకీయానికి సంబంధం లేదు. నేను రాజకీయాల్లో ఉన్నా.. సినిమా ద్వారా కొత్త గా రాజకీయాల్లో అడ్వాంటేజ్ తీసుకునేదేమీలేదు' అని జగ్గారెడ్డి చెప్పకొచ్చారు. విద్యార్థి నేతగా, కౌన్సిలర్‌గా రోల్ ఉంటుంది. మున్సిపల్ ఛైర్మన్ ఎలా అయ్యాననేది ఇందులో చూపిస్తాం. లవ్, ఫ్యాక్షన్, ఎమోషన్ , పొలిటికల్‌గా సినిమా ఉంటుంది. ఢిల్లీ టూర్ నన్ను పూర్తి గా మార్చేసింది.



## 2 నిమిషాలకో మెట్రో!


రోజు రోజుకూ మెట్రో ప్రయాణికుల రద్దీ అనూహ్యంగా పెరుగుతోంది. ఎండల తీవ్రత పెరుగుతుండటంతో నగర వాసులు మెట్రో వైపు మొగ్గుచూపుతున్నారు. ప్రస్తుతం ప్రతి రోజూ సుమారు 5.05 లక్షల మందికి పైగా ప్రయాణం చేస్తుండగా వచ్చే ఏప్రిల్, మే నెలల్లో ప్రయాణికుల రద్దీ 5.50 లక్షలకు పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే ఉదయం, సాయంత్రం వేళల్లో జనం కిక్కిరిసి ప్రయాణిస్తుండగా ఏప్రిల్ నాటికి పరిస్థితి మరింత ఇబ్బందిగా మారనుంది. మెట్రోల్లో కనీసం నిల్చుని ప్రయాణం చేసేందుకు కూడా అవకాశం లేని పరిస్థితి నెలకొంది, ప్రతి మెట్రోస్టేషన్‌లో ఇప్పటికే కనీసం రెండు రైళ్లకు సరిపడా ప్రయాణికులు ప్రతి ట్రిప్పు కోసం పడిగాపులు కాస్తున్నారు. వేసవి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఇప్పటికిప్పుడు అదనపు కోచ్‌లను ఏర్పాటు చేసే అవకాశం లేకపోయినా అదనపు ట్రిప్పులను పెంచేందుకు హైదరాబాద్ మెట్రోరైల్ చర్యలు చేపడుతోంది. ప్రయాణికుల రద్దీ మేరకు మెట్రో సర్వీసులను ఇప్పుడున్న 3 కోచ్‌ల నుంచి 6 కోచ్‌లకు పెంచేందుకు ఏడాది క్రితమే ప్రణాళికలను రూపొందించారు. మహారాష్ట్రలోని నాగపూర్ మెట్రో నుంచి మెట్రో కోచ్‌లను తెప్పించనున్నట్లు ప్రతిపాదించారు. ఈ మేరకు ఎల్‌అండ్‌టీ అధికారులు సైతం కొత్త కోచ్‌లను తెప్పించనున్నట్లు పలు సందర్భాల్లో పేర్కొన్నారు. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి పురోగతి లేదు. మరోవైపు ఎప్పటి వరకు వచ్చే అవకాశం ఉందనే విషయంలోనూ స్పష్టత లేకుండాపోయింది.

# 20 నుంచి రాష్ట్రవ్యాప్తంగా
# పర్యటించనున్న కేటీఆర్



భారత రాష్ట్ర సమితి 25 సంవత్సరాల సిల్వర్ జూబ్లీ సంబురాలను ఘనంగా నిర్వహించేందుకు పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రాల్లో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశాలు నిర్వహిస్తారు. ఇప్పటికే పార్టీ అధినేత కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ భవన్‌లో పార్టీ సీనియర్ నేతలు ప్రజాప్రతినిధులతో విస్తృతస్థాయి సమావేశం జరిగిన విషయం తెలిసిందే. అందులో భాగంగా వరంగల్‌లో లక్షలాదిమంది పాల్గొననున్న భారీ బహిరంగ సభను విజయవంతంగా నిర్వహించనునట్లు పార్టీ ప్రకటించింది. పార్టీ సిల్వర్ జూబ్లీ కార్యక్రమాల్లో భాగంగా అనేక కార్యక్రమాలు, సంబరాలను నిర్వహిస్తూ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా కార్యాచరణ రూపొందించబడింది. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను వేటిని అమలు చేయకుండా వంచిస్తున్న తీరుపై కూడా చేపట్టాల్సిన కార్యాచరణపై పార్టీ శ్రేణులకు, జిల్లా నేతలకు, కార్యకర్తలకు కేటీఆర్ స్వయంగా మార్గదర్శనం చేయనున్నారు. ఈ నేపథ్యంలో, మార్చి 20న సూర్యాపేట జిల్లా కార్యకర్తలతో, 23న కరీంనగర్ జిల్లా నాయకులతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించనున్నారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల అనంతరం కేటీఆర్ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో పర్యటించనున్నారు. 14 ఏండ్ల ఉద్యమ ప్రస్థానంతోపాటు, పదేండ్ల ప్రగతి ప్రస్థానంలో తెలంగాణ సమాజంతో బీఆర్ఎస్ పార్టీ పెనవేసుకున్న ఆత్మీయ అనుబంధాన్ని ఈ సమావేశాల సందర్భంగా మరోసారి గుర్తుచేసుకోనున్నారు. పార్టీకి ఎన్నిరకాల ఒడిదుడుకులు ఎదురైనా గులాబీ జెండాను గుండెల్లో పెట్టుకుని నిలబడ్డ పార్టీ శ్రేణులకు రానున్న రోజుల్లో మళ్లీ ఉజ్వల భవిష్యత్తు ఉండబోతున్న విషయాన్ని కేటీఆర్ తెలియజేయనున్నారు. ఏడాదిన్నరలోనే తీవ్రమైన ప్రజావ్యతిరేకతను మూటగట్టుకున్న కాంగ్రెస్ సర్కారుపై ప్రజలు దుమ్మెత్తి పోస్తున్నారని, తెలంగాణ ప్రజల భరోసా ఇప్పుడు బీఆర్ఎస్ పైన, కేసీఆర్ పైనే ఉన్న నేపథ్యంలో రానున్న రోజుల్లో మరింత క్రియాశీలకంగా పనిచేయాలని దిశానిర్దేశం చేయబోతున్నారు. కేటీఆర్ పర్యటనల వలన పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్తేజం నిండనున్నది.

## ప్రేమను పెద్దలు
## అంగీకరించరేమోనని..?





పరిపక్వతలేని ప్రేమ వ్యవహారం ఇద్దరి ప్రాణం తీసింది. ఇరు కుటుంబాల్లో ఎలాంటి నిర్బంధాలు లేవని, వారి ఫిర్యాదులతో తెలుస్తోంది. అయినా ఎందుకు ప్రాణాలు తీసుకున్నారో తేలాల్సి ఉందనే సందేహం కలుగుతోంది. జమ్మికుంట మండలం బిజిగిరిషరీఫ్, పాపయ్యపల్లి సమీపంలోని రైల్వే ట్రాక్‌పై శనివారం రాత్రి యువతి, యువకుడు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. మంచిర్యాల రైల్వే పోలీస్ సబ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపిన వివరాలు.. కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలం రాచపల్లి గ్రామానికి చెందిన మెనుగు రాహుల్ (18)కు నిర్మల్ జిల్లా ఖానాపూర్ మండలం ఏరుచింతల గ్రామానికి చెందిన గోలేటి శ్వేత(20)తో పరిచయం ఏర్పడింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం ఫెయిల్ అయిన రాహుల్ హైదరాబాద్‌లో ఎల్ఈడీ బల్బ్స్ ఈవెంట్ వర్క్స్ చేస్తుంటాడు. ఇంటర్ సప్లిమెంటరీ ఎగ్జామ్ రాసి ఇంటికి వద్ద ఉంటున్నాడు. శ్వేత కరీంనగర్‌లోని ఉమెన్స్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. శివరాత్రి పండుగకు ఇంటికి వెళ్లిన శ్వేత ఇటీవల కరీంనగర్ కళాశాలకు వచ్చింది. కాగా శనివారం రాత్రి ఇద్దరూ జమ్మికుంట మండలం పాపయ్యపల్లి శివారులోని రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యకు పాల్పడేందుకు సిద్ధపడ్డారు. గూడ్స్ డ్రైవర్ హారన్ మోగించినా పట్టాల పైనుంచి జరగకుండా ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే పోలీస్ అధికారులకు సమాచారం ఇచ్చినట్లు తెలిసింది. వీరి మధ్య ప్రేమ ఎక్కడ, ఎలా చిగురించిందో తెలియదుగానీ, ఇద్దరూ ఏ నిర్బంధాలు లేకుండానే సున్నిత మనస్తత్వంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలుస్తోంది. ప్రేమ వ్యవహారం వల్లే ఆత్మహత్య చేసుకున్నాడని రాహుల్ తండ్రి రాజు ఫిర్యాదు ఇవ్వగా.. ఏ కారణంతో చనిపోయిందో తెలియదని మృతురాలి తండ్రి రాజలింగు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఏదిఏమైనా ఇద్దరి ఆత్మహత్య ఘటన కారణాలు లేకుండా మిస్టరీగా మారింది. ఇద్దరి మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం నెలకొంది.










# ఐపీఎల్ 2025లో
# బెస్ట్ ఓపెనింగ్ జోడీ







లక్నో సూపర్ జెయింట్స్.. ఈ జట్టుకు ఐడెన్ మార్క్‌రమ్, మిచెల్ మార్ష్ ఓపెనింగ్ చేయవచ్చు. ఇద్దరికీ ఓపెనింగ్‌లో పెద్దగా మంచి రికార్డులు లేవు. అటు ఈ జట్టు కెప్టెన్ రిషబ్ పంత్ కూడా ఓపెనింగ్‌లో ఆడే అవకాశం కనిపిస్తోంది.ఢిల్లీ క్యాపిటల్స్.. ఈ టీంకు ఓపెనింగ్ విషయంలో చాలా ఆప్షన్స్ ఉన్నాయి. మెయిన్లీ జాక్ ఫ్రేజర్ మెక్‌గర్క్. అతడితో లాస్ట్ సీజన్ ఓపెన్ చేసిన అభిషేక్ పోరెల్. అలాగే ఫాఫ్ డుప్లెసిస్, కెఎల్ రాహుల్ లాంటి ఓపెనర్లు కూడా ఈ జట్టులో ఉన్నారు. ఈసారి మెక్‌గర్క్, కెఎల్ రాహుల్ ఓపెనింగ్ చేసే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

పంజాబ్ కింగ్స్.. ఈ జట్టుకు చాలా డీసెంట్ ఓపెనింగ్ పెయిర్ ఉంది. రెగ్యులర్ ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్‌తో పాటు ఆస్ట్రేలియా బ్యాటర్ జోష్ ఇంగ్లిస్ ఓపెనింగ్ దిగనున్నారు. ఖచ్చితంగా ఈ పెయిర్ డేంజరస్‌గా మారే ఛాన్స్‌లు ఉన్నాయి.

కోల్‌కతా నైట్ రైడర్స్.. గత సీజన్‌లో ఓపెనర్‌గా సునీల్ నరైన్ స్ట్రాంగ్ కంబ్యాక్ ఇచ్చాడు. మళ్లీ ఓపెనర్‌గా కంటిన్యూ కావచ్చు. ఇక అతడికి పార్ట్‌నర్‌గా రెగ్యులర్ ఓపెనర్ డికాక్ లేదా గుర్బాజ్ బరిలోకి దిగే అవకాశం ఉంది.

ముంబై ఇండియన్స్.. ఈ జట్టుకు రెగ్యులర్ ఓపెనర్ రోహిత్ శర్మ ఎప్పటిలానే మ్యాచ్ ఓపెన్ చేయనుండగా.. అతడితో పాటు ఈసారి విల్ జాక్స్ ఓపెనింగ్ ఆడే అవకాశం కనిపిస్తోంది.

చెన్నై సూపర్ కింగ్స్.. ఈ జట్టు ఆల్రెడీ టెస్టెడ్ అండ్




ఇంప్రూవ్డ్ ఓపెనింగ్ పెయిర్ ఉంది. వాళ్లెవరో కాదు రుతురాజ్ గైక్వాడ్, న్యూజిలాండ్ బ్యాటర్ డివాన్ కాన్వే. వీరిద్దరూ కూడా 2023లో సీఎస్కే కప్ గెలవడంలో కీలక పాత్ర పోషించారు.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు.. ఈసారి ఆర్సీబీ టీం కొత్త ఓపెనింగ్ పెయిర్‌ను బరిలోకి దింపనుంది. విరాట్ కోహ్లీతో పాటు కొత్తగా వచ్చిన ఫిలిప్ సాల్ట్ ఓపెనింగ్ దిగనున్నాడు. వీరిద్దరూ కూడా గేర్ మారిస్తే.. కచ్చితంగా అగ్రెషన్‌తో ఆడతారు.

రాజస్థాన్ రాయల్స్.. జాస్ బట్లర్ ఈ ఏడాది లేకపోవడంతో.. రాయల్స్ జట్టులో ఐపీఎల్ 2025లో డెడ్లీ ఓపెనర్లు బరిలోకి దిగనున్నారు. వారే సంజూ శాంసన్, యశస్వి జైస్వాల్. ఇద్దరూ కూడా టీమిండియా ఓపెనర్లు కావడం ఒక ఎత్తయితే.. వీరిద్దరూ కూడా డిస్ట్రిక్టివ్.

గుజరాత్ టైటాన్స్.. ఐపీఎల్ 2025 సీజన్‌లో ఈ జట్టుకు అరివీర భయంకర ఓపెనర్లు బరిలోకి దిగనున్నారు. శుభ్‌మాన్ గిల్, జాస్ బట్లర్.. వీరిద్దరూ కుదురుకుంటే.. ఇక ఆకాశమే హద్దుగా చెలరేగిపోతారు.